సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



ఆలోచనలు.. ఆవిష్కరణలు
ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు - 8లో▸ భవిష్యత్ అవసరాలకు తగినట్లు సరికొత్త ఆవిష్కరణలను రూపొందించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపి శభాష్ అనిపించుకుంటున్నారు.



ఏసీబీకి చిక్కిన అవినీతి చేప
ఏటూరునాగారంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ రైతు వద్ద సర్వేయర్ లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కాడు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.0°/20.0°
జిల్లాలో ఉదయం చలితో కూడిత వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు భూపాలపల్లిలో రేవంత్‌రెడ్డి యాత్ర

భూపాలపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేడు(మంగళవారం) జిల్లాకేంద్రంలో యాత్ర నిర్వహించనున్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమంలో భాగంగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కాశీంపల్లికి సోమవారం రాత్రి 9:30 గంటలకు చేరుకున్నారు. అక్కడే బసచేసిన ఆయన మంగళవారం ఉదయం ఏడు గంటలకు కేటీకే 5వ గని ఆవరణలో గేట్ మీటింగ్‌లో పాల్గొని సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటారు. అనంతరం కాశీంపల్లిలో తన శిబిరానికి చేరుకొని ప్రజాసంఘాలు, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం అవుతారు. మధ్యాహ్న భోజనం అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు కాశీంపల్లి నుంచి యాత్ర ప్రారంభం అవుతుంది. సెగ్గంపల్లి, జంగేడు, రాంనగర్, ఎల్‌బీ నగర్, లక్ష్మీనగర్, రాజీవ్ చౌక్ మీదుగా అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు.

కొవ్వొత్తులతో సంతాప ర్యాలీ



కాటారం: మెడికో ప్రీతి మృతికి సంతాపంగా కాటారం మండలకేంద్రంలో బంజారా సేవా సంఘం, పలు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తులతో సంతాప ర్యాలీ నిర్వహించారు. ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంజారా సేవాసంఘం మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్, భోజనాయక్, డీటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు జనగామ కరుణాకర్‌రావు, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామునాయక్, సంఘాల నాయకులు మోహన్, అలోత్ ప్రతాప్, జగన్ నాయక్, లక్ష్మణ్‌నాయక్, రాజారావు, దేవ్ నాయక్, జంగ సమ్మయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కౌన్సిలర్ బహిష్కరణ



భూపాలపల్లి రూరల్: పార్టీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న భూపాలపల్లి మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ నాగవెల్లి సరళను బీఆర్ఎస్ పార్టీనుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ తెలిపారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌన్సిలర్ సరళ, ఆమె భర్త రాజలింగమూర్తి కొన్ని రోజులుగా ప్రజా, పార్టీ వ్యతిరేక పనులు చేస్తున్నారన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. పలు ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ఆమోదంతో పార్టీ నుంచి బహిష్కరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, కౌన్సిలర్లు అనిల్, రవికుమార్, రజిత, తిరుపతి, రాజు, సమ్మయ్య, నాయకులు సిద్దు, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

13న పాలక మండలి ప్రమాణ స్వీకారం?

కాళేశ్వరం: కాళేశ్వరం దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం మార్చి 13న చేయనున్నట్లు సమాచారం. ఇటీవల కాళేశ్వర దేవస్థానం 14 మంది డైరెక్టర్లు, ఒక ఎక్స్ అఫీషియో మెంబర్‌తో కలిపి 15మందితో కూడిన నూతన పాలక మండలి నియామక ఉత్తర్వులు వచ్చిన విషయం తెలిసిందే. 15మందిలో ఒకరిని డైరెక్టర్లు చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. మహదేవపూర్ మండలం అంబటిపల్లికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్‌ను అధిష్టానం దేవస్థాన చైర్మన్‌గా నిర్ణయించినట్లు తెలిసింది.

జెడ్పీ సీఈఓ ఆకస్మిక తనిఖీ



మహదేవపూర్: మండలంలోని సూరారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను జెడ్పీ సీఈఓ రఘువరన్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్లలో రికార్డులను పరిశీలించారు. పిల్లలకు సరైన పోషకాహారం అందించాలని టీచర్లకు సూచించారు. గ్రామంలోని పిల్లలను అందరినీ అంగన్‌వాడీలో చేర్పించి పోషకాహారం అందించాలని చెప్పారు. అనంతరం కంటి వెలుగు కేంద్రాన్ని సందర్శించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని అన్నారు.

బహిరంగ సభకు హాజరైన జనం



గులాబీ శ్రేణుల్లో కేటీఆర్ జోష్!

- సోడషపల్లిలో రూ.153 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- అడుగడుగునా కేటీఆర్‌కు ఘనస్వాగతం
- రైతు కృతజ్ఞత సభకు భారీగా జనం
- బీజేపీ, కాంగ్రెస్ టార్గెట్‌గా ప్రసంగం
- రెండు కథలు చెప్పిన మంత్రి .. వరాల జల్లు
- సభ అనంతరం 'పల్లా' ఇంట్లో భేటీ

సాక్షిప్రతినిధి, వరంగల్/ధర్మసాగర్: ఐటీ, పరిశ్రములు, పురపాలకశాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పర్యటన గులాబీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపింది. 27 రోజుల వ్యవధిలో మూడోసారి ఉమ్మడి వరంగల్‌లో పర్యటించిన ఆయన.. సోమవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలం సోడషపల్లిలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో సోమవారం మధ్యాహ్నం సోడషపల్లికి చేరుకున్న కేటీఆర్‌కు రైతువేదిక వద్ద మంత్రులు, ప్రజాప్రతినిధులు అధికారులు, స్వాగతం పలికారు. అనంతరం పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంట్లో భోజనం చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన కేటీఆర్.. సోడషపల్లిలో రైతు కృతజ్ఞత సభలో పాల్గొని ప్రసంగించారు.

కథలు చెప్పి ఆకట్టుకున్న కేటీఆర్...
బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు టార్గెట్‌గా ఘాటైన వ్యాఖ్యలు చేసిన మంత్రి కేటీఆర్.. ప్రసంగానికి ముందు ఒకటి, తర్వాత మరో కథ చెప్పి ఆకట్టుకున్నారు. సభలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు తాడికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డిలు మాట్లాడిన తర్వాత.. మంత్రి కేటీఆర్‌ను మాట్లాడాలని కోరారు. దీంతో మైకు తీసుకున్న ఆయన 'సభకు వచ్చేటప్పుడు నా కూతురిని అడిగా.. మొదట, మధ్యలో, చివరన మాట్లాడమంటే ఏం చేయాలని.. నా కూతురు అందుకు మొదట మాట్లాడుమంటే నా తర్వాత మాట్లాడే వారు చాలా మాట్లాడేది ఉంటుందని ముగించమంది.. మధ్యలో మాట్లాడాల్సి వస్తే ముందు మాట్లాడిన వారు చాలా



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్

చెప్పారు.. తర్వాత మాట్లాడే వారు ఉన్నారని ముగించమంది. ఒకవేళ చివరన మాట్లాడమంటే.. నేను చెప్పేటివన్నీ అందరూ చెప్పారని కూర్చోమంది.. ఇప్పుడు నా పరిస్థితి అలాగే ఉంది.. నేను చెప్పాలనుకున్నవి అందరూ మాట్లాడారు.. అయినా మాట్లాడుతాను' అంటూ నవ్వించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పదే పదే ప్రసంగంలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి అనడంపైనా కేటీఆర్ సెటైర్ వేశారు. 'వెనుకటికి ఓ పిల్లాడు బడికి వెళ్లమంటే వెళ్లలేదు..చెడుమార్గం పట్టి తాగుడు, చెడు తిరుగుళ్లకు బానిసయ్యాడు.. చివరకు తండ్రి ప్యాంట్ జేబులోంచి పర్స్ దొంగిలిస్తుంటే మందలించినందుకు రోకలిబండతో తల్లిని చంపాడు. ఇదేంటన్న తండ్రిని అదే విధంగా అంతమొందించాడు.. పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చిన తర్వాత ఎందుకు ఘోరాలు చేశావు, తల్లిదండ్రులను చంపుతారా? అని జడ్జి అడిగితే.. సార్ నన్ను వదిలిపెట్టండి.. అయ్యా, అవ్వ లేని అనాథనని వేడుకున్నాడట.. అలాగుంది రేవంత్ పరిస్థితి కూడా.. దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇవ్వమంటే' ఇలానే ఉంటుందని కేటీఆర్ సెటైర్లు వేశారు.

వరాల జల్లు కురిపించిన మంత్రి...
పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాడికొండ రాజయ్య, కడియం శ్రీహరిల కోరిక మేరకు మంత్రి కేటీఆర్ వరాల జల్లు కురిపించారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రాన్ని మున్సిపాలిటీగా ప్రకటిస్తామన్న కేటీఆర్ వేలేరు, ధర్మసాగర్‌లను పరిశీలిస్తామని, సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో మరో డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తామన్నారు. సుమారు రూ.153 కోట్లతో ప్రారంభించిన పనులను 6 నుంచి 12 నెలల్లో పూర్తి చేస్తామని, అవసరమైతే అదనపు నిధులు కూడా కేటాయిస్తామన్నారు.

ప్రజలకు నమస్కరిస్తున్న మంత్రి కేటీఆర్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- సోడషపల్లి గ్రామంలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు.
- స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాలైన వేలేరు, ధర్మసాగర్, చిల్పూర్ మండలాలకు సాగునీరు అందించేందుకు రూ.103కోట్లతో మూడు లిఫ్టులు, చెరువుల్లోకి నీటిని పంపింగ్ చేయడానికి పైపులైన్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.
- ధర్మసాగర్ నుంచి వేలేరు మండల కేంద్రానికి సుమారు రూ.25కోట్లతో నిర్మించిన డబుల్ బీటీ రోడ్డును ప్రారంభించారు.
- రూ.3.08కోట్లతో గుండ్లసాగర్ నుంచి వెంకటాద్రిపేట వరకు బీటీ రోడ్డు పనులు, రూ.3.39కోట్లతో వేలేరు నుంచి కొత్తకొండ వరకు బీటి రోడ్డు, రూ.4కోట్లతో గుండ్లసాగర్ నుంచి పీచర వరకు బీటీరోడ్డు పనులను శంకుస్థాపన చేశారు.
- ధర్మసాగర్ బండ్‌పై రూ.4కోట్లతో పర్యాటక కేంద్రం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

ఆయా కార్యక్రమాల్లో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీలు కవిత, దయాకర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస రెడ్డి, తాత మధుసూదన్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, శాసనసభ్యులు తాటికొండ రాజయ్య, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నన్నపునేని నరేందర్, అరూరి రమేష్, సతీష్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్లు డాక్టర్ సుధీర్ బాబు, గండ్ర జ్యోతి, కుసుమ జగదీష్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, పోలీస్ కమిషనర్ రంగనాథ్, మున్సిపల్ కమిషనర్ ప్రావీణ్య, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రులు, నాయకులు ఏమన్నారంటే..
- వివరాలు 8లో▸

గిర్నితండాలో ప్రీతి అంతిమయాత్రకు హాజరైన జనం



ఏ బేటీయే చోడ్‌గి ఖాయియే!

అశ్రునయనాల మధ్య గిర్నితండాలో ప్రీతి అంత్యక్రియలు

- కడసారి చూపునకు తరలివచ్చిన గిరిజనం
- ప్రతిపక్ష నేతల రాకతో ఉద్రిక్తత పరిస్థితులు
- రోడ్డుపై బైఠాయించిన మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు
- పోలీసుల భారీ బందోబస్తు



దేవరుప్పుల/కొడకండ్ల : 'ఏ బేటీయే చోడ్‌గి ఖాయియే'(ఓ బిడ్డా మమ్మల్ని వదిలి వెళ్లిపోయావా) అంటూ గిరిజనం రోదించింది. 'డాక్టర్ అయి ఆసరా అవుతావనుకుంటే.. విగత జీవిగా వచ్చావా బేటీ'అంటూ గిర్నితండాతో పాటు పరిసర తండాల గిరిజన ప్రజలు కన్నీరు మున్నీరుగా విలపించారు. 'మా ఆరోగ్యాలకు కొండంత అండగా ఉంటావనుకుంటే అప్పుడే నూరేళ్లు నిండినాయా తల్లీ' అంటూ నరేందర్ కుటుంబసభ్యులతో కలిసి ప్రీతి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడిపెట్టించింది. మెడికల్ పీజీ విద్యార్థిని ధరావత్ ప్రీతి అంత్యక్రియలు జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాలో అశ్రునయనాల మధ్య సోమవారం ముగిశాయి. కడసారి చూపుకోసం గిరిజనం తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ(అనస్తీషియా) ఫస్టియర్ చేస్తున్న ప్రీతి తన సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులు తట్టుకోలేక గత బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఐదురోజుల పాటు నిమ్స్‌లో మృత్యువుతో పోరాడి ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచిన విషయం తెలిసిందే..

గిరిజన సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు
రైల్వే శాఖలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న నరేందర్ ఉద్యోగ రీత్యా(భార్య, ముగ్గురు కుమార్తెలు, కొడుకు) కుటుంబంతో హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. పిల్లల ఉన్నత విద్య కోసం స్వగ్రామంలోని మూడెకరాల వ్యవసాయ భూమి అమ్మేయగా.. మిగిలిన ప్లాటు, పాలివారి నుంచి వచ్చిన రెండు గుంటల స్థలం ఉంది. మృతదేహాన్ని సందర్శనార్థం ప్లాటులో ఉంచిన అనంతరం.. ఆ రెండు గుంటల స్థలంలో గిరిజన సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు.

భారీ బందోబస్తు మధ్య..
జనగామ డీసీపీ సీతారాం పర్యవేక్షణలో వర్ధన్నపేట ఏసీపీ శ్రీనివాసరావు నేతృత్వంలో సీఐలు, ఎస్సైలు, రోప్ పార్టీ పోలీసుల బందోబస్తు మధ్య ప్రీతి అంత్యక్రియలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు పూర్తయ్యాయి. నివాళులర్పించేందుకు వచ్చిన మాజీ ఎంపీ ధరావత్ రవీంద్రనాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంత రెడ్డి, రాష్ట్ర నాయకులు లేగ రాంమోహన్‌రెడ్డి, ఏనుగుల రాకేష్‌రెడ్డి తదితరులు ప్రీతి ఘటనపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. రోడ్డుపై బైఠాయించారు. డీసీపీ నచ్చజెప్పినా వినకపోవడంతో పోలీసులు చెదరగొట్టారు. చివరికి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వర్‌రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్ గాంధీనాయక్, నంగ రాభేరీ, తెగ రాష్ట్ర నాయకులు నరేందర్ పవార్, రాజేష్‌నాయక్, సురేష్‌నాయక్, తదితరులు నివాళులర్పించారు.



రోదిస్తున్న కుటుంబసభ్యులు

ముమ్మాటికీ హత్యే..
- కుటుంబ సభ్యుల ఆరోపణ

'మా కుటుంబంలోనే ప్రీతి తెలివికల్లది.. ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు.. ఇదీ ముమ్మాటికీ హత్యే'అని ప్రీతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. పదేళ్లపాటు కష్టపడి చదివి పీజీలో చేరినప్పుడు.. సీటు వదులుకుంటే రూ.50 లక్షలు చెల్లించాలని ప్రభుత్వం తమచేత బాండు రాయించుకుందని.. ఇప్పుడు తమ కూతురు మరణానికి ఎవరు బాధ్యులో తేల్చాలని డిమాండ్ చేశారు. తమలా మరొకరికి అన్యాయం జరగకుండా కళాశాల ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీ తదితరులను సస్పెండ్ చేసి నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

చేతిలో చేయి వేసి.. భరోసా ఇచ్చి

- సమస్యలు వింటూ ముందుకు సాగిన రేవంత్‌రెడ్డి
- పరకాల నియోజకవర్గంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర
- గ్రామ గ్రామాన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానుల స్వాగతం
- పరకాల సభకు భారీగా హాజరైన జనం

నడికూడ/పరకాల: కనిపించిన ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ..వారి సమస్యలను వింటూ.. చేతిలో చేయి వేసి భరోసానిస్తూ ముందుకు సాగారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. మూడు రోజుల విరామం అనంతరం పరకాల నియోజకవర్గంలో సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగించారు. నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామంలో సాయంత్రం 4:30 గంటలకు కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి యాత్ర ప్రారంభించారు. ధర్మారంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం గ్రామస్తులు, గౌడ కులస్తులతో ముచ్చటించారు. అక్కడినుంచి నడికూడకు చేరుకున్నారు. బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. పులిగిల్లకు వెళ్లే మార్గమధ్యలో గత ఏడాది వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడగగా, మంత్రులు వచ్చి చూసి వెళ్లారని, ఇప్పటివరకు నష్టపరిహారం అందించలేదని రైతులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పులిగిల్ల గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించి, సమ్మక్క, సారక్కలను దర్శించుకున్నారు. రాయపర్తి గ్రామంలో పాఠశాల విద్యార్థులు, వృద్ధులతో ముచ్చటించారు. దారిలో వినతిపత్రాలు తీసుకుంటూ.. ఉత్సాహంగా పలకరిస్తూ మలక్కపేట మీదుగా పరకాలకు చేరుకున్నారు. యాత్ర పొడువునా రేవంత్‌రెడ్డితో సెల్ఫీల కోసం కార్యకర్తలు, అభిమానులు పోటీపడ్డారు.

బీఆర్ఎస్ నాయకులపై ఫైర్
పరకాల సభలో రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్ నాయకులపై ఫైర్ అయ్యారు. కేటీఆర్, మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి ఆరోపణలు గుప్పించారు. జిల్లాలో మంత్రి దయాకర్ దండుపాళ్యం ముఠా దోపిడీకి పాల్పడుతుందంటూ మరోసారి గుర్తు చేశారు.. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



పాదయాత్ర చేస్తున్న రేవంత్‌రెడ్డి



వృద్ధులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

పేరులోనే ధర్మం తప్ప అంతా అధర్మ పనులే చేస్తున్నారంటూ చెప్పుకొచ్చారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధి మాజీ మంత్రి కొండా సురేఖ, కొండా మురళి దంపతులు చేసిందే అని అన్నారు.

కాంగ్రెస్ తలుచుకుంటే బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై తిరగలేరు: నాయిని రాజేందరెడ్డి
కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఇక మీదట దాడులు జరిగితే సహించే ప్రసక్తే లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందరెడ్డి హెచ్చరించారు. పరకాల బస్టాండ్ కూడలిలో రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇక మీదట ఒక్క కార్యకర్తపై దాడి జరిగినా సహించబోమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు తలచుకుంటే బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై తిరగలేరని హెచ్చరించారు.

ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తున్నారు: ఎమ్మెల్యే సీతక్క
ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ కేసీఆర్ పరిపాలనలో ప్రశ్నించాలంటే భయపడే పరిస్థితి తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ వేధింపులను ప్రశ్నించిన పీజీ వైద్య విద్యార్థి ధరావత్ ప్రీతిని అత్యంతంగా దారుణంగా చంపారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన జోడో యాత్రను చూసిన తర్వాత బీఆర్ఎస్‌లో భయం మొదలైందన్నారు.

తాగునీరు, కుక్కలు, కోతుల సమస్య

త్వరలోనే ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

- తాగునీటి సమస్య రాకుండా ఏర్పాట్లు
- భూపాలపల్లి మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ అవినాష్
- సాక్షి ఫోన్‌ఇన్‌కు భారీ స్పందన

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీలో కోతులు, కుక్కలు, పందుల నివారణకు చర్యలు ప్రారంభిస్తాం. పలు కాలనీల్లో తాగునీటి నివారణ కోసం మున్సిపాలిటీతో పాటు సింగరేణి అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి పరిష్కార మార్గాలను చూపిస్తామని మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ పూజారి అవినాష్ తెలిపారు. పట్టణంలో త్వరలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సోమవారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు భారీస్పందన లభించింది.

కుక్కలు, కోతులు, పందుల బెడద అధికంగా ఉంది..
(శ్యామ్, సీఆర్‌నగర్, కృష్ణ, కారల్‌మార్క్స్‌కాలనీ. తిరుపతి, బానోత్‌వీధి, దిలీప్, హన్మాన్‌నగర్ కాలనీ)

కమిషనర్: కోతులు, కుక్కలు, పందుల నియంత్రణకు శాశ్వత ఏర్పాట్లు చేస్తాం. పందులు, కుక్కలను దూరంగా తరలించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే వేల సంఖ్యలో తరలించాం. పశుసంవర్ధ శాఖ ఆధ్వర్యంలో నియంత్రించేందుకు రూ.20లక్షల నిధులు కూడా కేటాయించాం.

సుభాష్‌కాలనీ, లక్ష్మీనగర్‌లో కోతుల బెడద అధికంగా ఉంది. ఇళ్లలోకి చొరబడుతున్నాయి. దోమల నియంత్రణకు ఫాగింగ్ లేదు.
(హరిప్రసాద్, బట్టు కర్ణాకర్)

కమిషనర్: కోతుల నియంత్రణకు ఇప్పటికే సింగరేణి అధికారులతో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కోతులను నియంత్రించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

సరిపడా తాగునీరు రావడం లేదు..
(లక్ష్మణ్‌చారి, రజియా, ప్రమిళ, ఆసం సురేష్, కృష్ణాకాలనీ)



కమిషనర్: గతంలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో కృష్ణాకాలనీకి తాగునీటి సరఫరా చేసేవారు. సింగరేణి అధికారులతో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రధాన రహదారిపై దుమ్ము లేస్తుంది..
(వెంకటేశ్, మంజూర్‌నగర్)

కమిషనర్: భూపాలపల్లి నుంచి చెల్పూర్ వరకు చేపడుతున్న నేషనల్ హైవే రోడ్డు విస్తరణ, డ్రెయినేజీల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం.

పారిశుద్ధ్య పనులు చేయడం లేదు, డ్రెయినేజీల నిర్మాణంలో నాణ్యత లేదు..
(రమేష్, కుమారస్వామి, ఎల్‌బీనగర్)

కమిషనర్: వారం క్రితం కేటీఆర్ కార్యక్రమం ఉండటం వలన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఆలస్యం జరిగింది. సిబ్బందిని పంపించి చేయిస్తాం. డ్రెయినేజీల నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో పర్యవేక్షణ చేయిస్తాం. నాణ్యత లేకపోతే చర్యలు తీసుకుంటాం.

డ్రెయినేజీ నిర్మాణం ప్రారంభించడం లేదు..
(ప్రవీణ్, రెడ్డికాలనీ)

కమిషనర్: రెడ్డికాలనీలో పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం కోసం గోడలు కూల్చివేశాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తాం.

పోస్టాఫీస్ పక్క కాలనీలో డ్రెయినేజీలో నీరు వెళ్లడం లేదు. ఏళ్లుగా సతమతమవుతున్నాం..
(అబ్దుల్ కబీర్, బ్రహ్మం, కమల, మల్లికార్జున్, రాజీవ్‌నగర్)

కమిషనర్: ఇంజనీరింగ్ అధికారులను పంపించి శాశ్వత పరిష్కార మార్గం కోసం ఏర్పాట్లు చేస్తాం.

మిషన్ భగీరథ నీరు రావడం లేదు..
(అబ్దుల్ ఫాజిల్, రాజీవ్‌నగర్)

కమిషనర్: సాంకేతిక కారణాలతో మిషన్ భగీరథ నీరు రావడం లేదనుకుంటాను. సిబ్బందిని పంపించి పరిశీలించిన తర్వాత తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

రెడ్డికాలనీ టవర్ లైన్‌లో మురుగునీరు బయటికి వెళ్లకుండా నిల్వ ఉంటుంది.
(నరేష్, రెడ్డికాలనీ)

కమిషనర్: ఇంజనీరింగ్ అధికారులు, సూపర్‌వైజర్లను పంపిస్తాం. కారణాలను తెలుసుకొని సమస్యను పరిష్కరిస్తాం.

గణేష్‌చౌక్‌లో పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు..
(సుధాకర్, వ్యాపారి, గణేష్‌చౌక్)

కమిషనర్: గతంలో అటవీశాఖ కార్యాలయ సమీపంలో ఉన్న టాయిలెట్స్ తొలగించాం. ఈ స్థలం కోర్టు వివాదంలో ఉండటం వలన నిర్మాణం చేపట్టలేకపోతున్నాం. ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసేందుకు స్థలం కోసం చూస్తున్నాం.

లారీలతో ఓసీ–2 నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు దుమ్ము విపరీతంగా లేస్తుంది.
(శ్రీకాంత్, రాంనగర్‌కాలనీ)

కమిషనర్: సింగరేణి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం. మరోసారి మాట్లాడి దుమ్ము రాకుండా నీళ్లు చల్లించే ఏర్పాట్లు చేస్తాం.

మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వడం లేదు..
(చిన్న మల్లయ్య, మహబూబ్‌పల్లి)

కమిషనర్: ఇంటి అనుమతి, ఇంటి పన్ను రసీదులు తీసుకువచ్చి మున్సిపాలిటీ కార్యాలయంలో దరఖాస్తు చేయండి. దరఖాస్తును పరిశీలించి కనెక్షన్ వచ్చే విధంగా చేస్తాం.

చికెన్‌సెంటర్ల వ్యర్థాలతో దుర్వాసన వస్తోంది..
(ఖాదర్‌పాషా, పోలీస్‌స్టేషన్ రోడ్డు)

కమిషనర్: చికెన్ దుకాణాల నుంచి వ్యర్థాలను తీసుకువెళ్లేందుకు హనుమకొండ నుంచి ప్రతి రోజు ఒక వాహనం వస్తుంది. కొద్దిరోజుల్లోనే చికెన్, మటన్ దుకాణాలను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు తరలిస్తాం.

పిల్లోనిపల్లిలో డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడుతున్నా..
(చంద్రయ్య, పిల్లోనిపల్లి)

కమిషనర్: మార్చి నెలలో రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయిస్తాం. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

క్లుప్తంగా

యువతి అదృశ్యం

చెన్నారావుపేట : యువతి అదృశ్యమైన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని కాల్‌నాయక్ తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇదే తండాకు చెందిన లావుడ్య ఈరు కుమార్తె నాగేశ్వరి (17) నర్సంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఈ నెల 25న ఈరు తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లి ఇంటికి వచ్చేవరకు ఇంట్లో ఉన్న కూతురు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు కనిపించడం లేదని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

రక్షితకు ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం

ఎంజీఎం: వరంగల్ నగరంలోని రామన్నపేటలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన జయముఖి ఇంజనీరింగ్ విద్యార్థిని రక్షితకు సోమవారం ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. రక్షిత ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఎంజీఎం మార్చురీకి పెద్దఎత్తున తరలివచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

నల్లబెల్లి: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించగా ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్సై అజ్మీర సురేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన వేముల రాజయ్య(65) మల్లికాంబ దంపతులకు ఇద్దరు పిల్లలు. సుమారు 30 ఏళ్ల క్రితం మూడో కాన్పులో మల్లికాంబ మృతి చెందగా రాజయ్య తిరుపతమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. 10 ఏళ్లపాటు వీరి దాంపత్య జీవితం సజావుగానే సాగింది. తర్వాత వారి కుటుంబంలో కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో రాజయ్య అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మానసిక ఆందోళనకు గురైన రాజయ్య ఆదివారం ఇంట్లో బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యయత్నానికి యత్నించాడు. కుటుంబ సభ్యులు రాజయ్యను 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపాడు.

విద్యుత్ ఆదా



దేశంలో విద్యుత్ ఆదా చేసే ప్రయత్నాలు చాలా తక్కువ.. అవసరం లేకున్నా ఎక్కువ మొత్తంలో విద్యుత్‌ను వినియోగిస్తున్నాం.. వీటిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన సమయంలో మాత్రమే విద్యుత్ వినియోగించేలా ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ సిస్టం రూపొందించారు జయశంకర్ భూపాలపల్లి మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎండీ ఇర్ఫాన్, రియాన్‌లు. వీరు రూపొందించిన పరికరం.. గ్రామ, మండల, మున్సిపాలిటీ, జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసినటువంటి వీధిలైట్లకు అన్నింటికి కలిపి ఒక దగ్గర లైట్ డిపెండింగ్ రెసిస్టర్(ఎల్‌డీఆర్) సెన్సార్‌ను అనుసంధానం చేయాలి. సెన్సార్‌పై చీకటి పడగానే లైట్లు వెలుగుతాయి. సెన్సార్‌పై వెలుతురు పడగానే ఆఫ్ అవుతాయి. దీనివల్ల విద్యుత్ ఆదా కావడంతో పాటు తక్కువ బిల్లు, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ఈ ప్రాజెక్టును కేరళలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు.

వ్యర్థ పదార్థాలతో విద్యుత్ ఉత్పత్తి




ఈ ప్రాజెక్టు ద్వారా వ్యర్థ పదార్థాల వల్ల కలిగే కాలుష్యం నివారించవచ్చు. ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను పడేయడం ద్వారా భూమి, నీటి, గాలి కాలుష్యం పెరిగి మానవ మనుగడను దెబ్బతీస్తున్నాయి. కాలుష్య నివారణకు వ్యర్థపదార్థాలను మండించడం ద్వారా వెలువడిన కాంతిని సోలార్ ప్యానల్ ద్వారా గ్రహించి విద్యుత్ ఉత్పత్తి చేసేలా జనగామ జిల్లా పెంబర్తి ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థి అర్జున్‌కుమార్ ప్రాజెక్టు రూపొందించాడు. ప్రత్యేకమైన గదిలో మండించి దానిద్వారా వెలువడిన కాంతిని సోలార్ ప్యానల్ ద్వారా కాంతి శక్తిని విద్యుత్ శక్తిగా మార్చడం ద్వారా మనకు ఉచితంగా విద్యుత్ శక్తిని పొందవచ్చు. ప్లాస్టిక్ వ్యర్థాలను మండించడం ద్వారా వచ్చే హానికర వాయువులను ప్రత్యేక గదుల గుండా పంపించి హానికర పదార్థాలను వడపోయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. గైడ్ టీచర్ ఉమాదేవి, హెచ్‌ఎం అర్జున్‌కుమార్‌ల సహకారంతో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు విద్యార్థి తెలిపాడు.

ఆలోచనలు.. ఆవిష్కరణలు

- సరికొత్త పరికరాలు రూపొందించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- నిత్యం ఎదుర్కొనే సమస్యలకు సైన్స్‌తో పరిష్కారాలు
- పర్యావరణ పరిరక్షణ.. తక్కువ ఖర్చుతో రూపకల్పన
- ఓరుగల్లుకు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన విద్యార్థులు

నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు విద్య, ఇతర రంగాల్లో కొంత వెనుకబాటుకు గురయ్యారు అన్న భావనను వీరు చెరిపేశారు. విద్య, ఆలోచనపరంగా తాము ఎక్కడా తగ్గేదేలే అంటూ బుర్రకు పదునుపెట్టారు. రోజువారీగా ఎదుర్కొనే సమస్యలను సైన్స్‌పరంగా ఎలా అధిగమించవచ్చో చూపిస్తూ భవిష్యత్ అవసరాలకు తగినట్లు సరికొత్త ఆవిష్కరణలను రూపొందించారు. మండల జిల్లా, రాష్ట్ర స్థాయిలో కాదు.. ఏకంగా జాతీయస్థాయి సైన్స్, ఇన్‌స్పైర్‌లో ప్రతిభ చూపారు. ప్రతిభ ఉంటే ఎక్కడైనా రాణించవచ్చని నిరూపించారు. ఓరుగల్లు కీర్తిని ఢిల్లీస్థాయిలో నిలబెట్టి అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. నేడు (మంగళవారం) జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన పరికరాలు, వాటి ఆవశ్యకతలు తదితర అంశాలతో ప్రత్యేక కథనం. - సాక్షి వరంగల్ డెస్క్

సైన్స్ డే ఎలా వచ్చిందంటే..



ఆధునిక ప్రపంచంలో సైన్స్‌లేనిది ఏమీ లేదు. మన రోజువారీ జీవితంలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తోంది. భౌతికశాస్త్రంలో సర్ సీవీ రామన్ చేసిన విశేష సేవలకు గుర్తుగా.. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ డే నిర్వహించుకుంటున్నాం. సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్ కనుగొన్నారు. ఆ రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

క్యాండిల్‌తో దోమలు పరార్



నిత్యం మనం దోమలబెడదను ఎదుర్కొంటున్నాం.. అలాంటి బాధను ఎదుర్కొంది మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరెడ మోడల్ స్కూల్ విద్యార్థిని నక్క భవాని. దోమలను చంపకుండా బయటికి వెళ్లేలా తక్కువ ఖర్చుతో ఇంట్లోనే తయారుచేసుకునే ప్రాజెక్టును రూపొందించింది. భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు సారంగపాణి సహకారంతో వ్యాక్స్ క్యాండిల్‌ను రూపొందించారు. బంతిఆకు, చేమంతి, వేప, వెల్లుల్లి, కర్పూరం కలిపి వ్యాక్స్‌తో క్యాండిల్ తయారు చేశారు. క్యాండిల్‌ను ముట్టించగానే ఆవిరి గది అంతా స్ప్రెడ్ అయి దోమలు, కీటకాలు పారిపోతాయి. ఇది దోమలను చంపడానికి కాదని, కేవలం పారిపోయేలా చేస్తుందని విద్యార్థిని భవాని 'సాక్షి'కి తెలిపింది. ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ప్రదర్శనలో గుర్తింపుగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక సహాయమంత్రి జితేంద్రసింగ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈ ప్రాజెక్టును జెడ్పీహెచ్ఎస్ బలపాలలో చదువుతున్నప్పుడు రూపొందించారు.

ఈజీ వేస్ట్ సెపరేటింగ్ చాపింగ్ చార్ట్



కూరగాయలు, పండ్లు కోసేటప్పుడు, వండేటప్పుడు వచ్చే వ్యర్థపదార్థాలపై ఈగలు, దోమలు వాలుతుంటాయి. దీనివల్ల రోగాల బారిన పడే అవకాశం ఉంటుంది. ప్రతి ఇంట్లోనూ ఇలాంటి పరిస్థితి ఉంటుంది. అలాంటి దృశ్యాన్ని తన ఇంట్లో చూసిన మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర విద్యార్థి ఎడ్ల నాని వ్యర్థాలపై ఈగలు, దోమలు వాలకుండా సరికొత్త ఆలోచనతో గైడ్ టీచర్ చంద్రగిరి ప్రభాకర్ సహకారంతో ఈజీ వేస్ట్ సెపరేటింగ్ చాపింగ్ చార్ట్ రూపొందించాడు. గ్యాస్‌స్టౌ కింద పైె ఉడ్‌తో చాపింగ్‌బోర్డును ఏర్పాటు చేశాడు. దీనికి ఏ హోల్, బీ హోల్ రెండు రంధ్రాలను చేశాడు. వంటలో వేసే పదార్థాలు ఏ రంధ్రంలో, వ్యర్థాలను బీ రంధ్రంలో వేసిన అనంతరం చెత్తబుట్టలోకి వెళ్లేలా తయారు చేశాడు. ఈ ప్రాజెక్టును చూసిన విదేశీయులు సైతం భళా అని మెచ్చుకున్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది.

గొలుసుకట్టు చెరువులు కనుమరుగు



వరంగల్‌లోని శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగది విద్యార్థి టి. శ్రీ సాయి ఖిలా వరంగల్‌లో కనుమరుగవుతున్న గొలుసుకట్టు చెరువులపై ప్రాజెక్టు రూపొందించారు. నాడు కాకతీయులు కట్టిన గొలుసుకట్టు చెరువుల ప్రాధాన్యత, వాటి ఆక్రమణ తీరు, జరిగే పర్యవసానాలపై గైడ్ టీచర్ కె.ధనలక్ష్మి సహకారంతో సమగ్ర ప్రాజెక్టు రూపొందించాడు. దీనిని గుజరాత్ అహ్మదాబాద్‌లోని సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించాడు. బంగారు పతకానికి ఎంపికైంది.

పేదలకు తక్కువ ధరలో క్యాండిల్స్..



9వ తరగతిలో తరచూ ఆరోగ్యం బాగా ఉండకపోవడంతో ఆబ్సెంట్ అయ్యేదాన్ని. మా సార్ సారంగపాణి ఎందుకు ఆబ్సెంట్ అవుతున్నావని అడిగారు. జ్వరం వస్తుంది అని చెప్పడంతో డాక్టర్లు ఇచ్చిన స్లిప్‌లు చూశారు. దోమలు ఉన్నాయా అంటే అవును సర్ అని చెప్పాను. ఆ తరువాత సైన్స్‌ఫెయిర్‌కు నన్ను సెలెక్ట్ చేశారు. దోమల నివారణపై ప్రాజెక్టు చేద్దామని సార్‌కు చెప్పాను. దీంతో ప్రకృతినుంచి వచ్చే పదార్థాలతో వ్యాక్స్ క్యాండిల్‌ను తయారుచేశాం. ఎంతో గుర్తింపు వచ్చింది. ఈ క్యాండిల్ పేదలకు తక్కువ ధరకు అందించవచ్చు. డాక్టర్ కావాలన్నది నా కోరిక. - నక్క భవాని

చెరువులను పరిరక్షించాలని..



శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి జాతీయ స్థాయి నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ (ఎన్‌సీఎస్‌సీ) పోటీలో ఖిలావరంగల్ కనుమరుగువుతున్న గొలుసుకట్టు చెరువులను ఎగ్జిబిట్టుగా ప్రదర్శించాం. వాటిని ఎలా రక్షించాలో సాంకేతికంగా ఎగ్జిబిట్ రూపొందించాం. కేంద్ర ప్రభుత్వ అధికారులు ప్రాజెక్టు, వివరించిన తీరుతో బంగారు పతకం లభించింది. చెరువులను పరిరక్షించాలి. - సాయి

మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

- ర్యాగింగ్‌తోనే ప్రీతి ఆత్మహత్య
- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి వెంకటేష్

భూపాలపల్లి: ప్రతీ ఆఫీసులో మహిళలపై వేధింపులు, ర్యాగింగ్‌లు రోజురోజుకు పెరుగుతున్నాయని, మహిళ హింసకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరు పోరాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జయశంకర్, మహబూబాబాద్, వరంగల్(2), పెద్దపల్లి(జేఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. మార్చి 8న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహిళలపై జరిగే రాజ్యహింస, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా జరుపుకోవాలని సూచించారు. పాలక వర్గాలు తమ ప్రయోజనాల కోసం భూస్వామ్య, సామ్రాజ్యవాద విషసంస్కృతిని ప్రోత్సహిస్తూ, దోపిడీని యథేచ్ఛగా కొనసాగించడానికి యువతను మద్యం, డ్రగ్స్, గంజాయికి అలవాటు చేయిస్తున్నాయని అన్నారు. ర్యాగింగ్, వేధింపుల కారణంగానే వరంగల్‌లో వైద్యవిద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ విషయాన్ని మరుగున పడేసేందుకు ప్రీతి ఇంజక్షన్ తీసుకొని ఆత్మహత్య చేసుకుందన్నారు. అందుకు కారణం సైఫ్ కాదని ఆస్పత్రి యాజమాన్యం బుకాయిస్తూ విద్యార్థులచే ధర్నాలు చేయిస్తుందని వెంకటేష్ పేర్కొన్నారు.

సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు

కాజీపేట రూరల్ : తిరుపతి నుంచి హజరత్‌నిజాముద్దీన్ వెళ్లే సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలు బ్యాగులో బాంబు ఉందన్న వదంతులతో పోలీసులు తనిఖీలు చేపట్టి బాంబులేదని నిర్ధారించి రైలును పంపించిన ఘటన సోమవారం కాజీపేట జంక్షన్‌లో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండకు చెందిన కారంగుల రేణుక, ఆమె అమ్మ, భర్త, ఆడపడుచుతో కలిసి తిరుపతిలో దర్శనం చేసుకొని సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో కాజీపేటకు వస్తున్నారు. సికింద్రాబాద్ దాటిన తర్వాత రేణుక జనరల్ బోగిలో ఇద్దరు నార్త్ ఇండియాకు చెందిన ఇద్దరు బెర్త్‌పై పడుకొని పక్కన లగేజీతో ఉన్నారు. రేణుక వారిని జరుగమని చెప్పగా జరుగకపోవడంతో వారి వద్ద లగేజీలో బాంబు ఉందని అనుమానంతో హనుమకొండలో ఉన్న తన అన్న మర్క వినయ్‌కు ఫోన్‌చేసి స్విచ్ఛాప్ చేసింది. దీంతో వినయ్ హన్మకొండ నుంచి హుటాహుటిన కాజీపేట జంక్షన్‌కు చేరుకొని జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాజీపేట రైల్వే అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శ్రీనివాస్, జీఆర్పీ సీఐ రాంమూర్తి, ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవ రావు, సివిల్ పోలీసులు, రైల్వే పోలీస్ సిబ్బంది ప్లాట్‌ఫాంకు చేరుకొని రాత్రి 7.20 గంటలకు చేరుకున్న ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగిలోకి ప్రవేశించి డాగ్ స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌తో తనిఖీ చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చిన ప్రయాణికురాలు రేణుకపై జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి చేప

- సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ
- రైతు నుంచి రూ. 10 వేలు లంచం డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



వివరాలను వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సుదర్శన్



ఏసీబీకి చిక్కిన సర్వేయర్ మహేందర్



పట్టించిన రైతు మనోహర్‌రావు

ఏటూరునాగారం : ఏసీబీకి అవినీతి చేప చిక్కింది. తహసీల్దార్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌గా విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ రైతు వద్ద రూ.10వేలు డిమాండ్ చేయడంతో లంచం తీసుకుంటుండగా సోమవారం ఏసీబీకి చిక్కాడు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు సంచలనంగా మారాయి. ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏటూరునాగారం గ్రామానికి చెందిన ఎర్రబెల్లి మనోహర్‌రావుకు చెందిన 30 ఎకరాల వ్యవసాయ భూమి మండలంలోని కోయగూడ ఎల్లాపూర్, రామన్నగూడెం, ఏటూరునాగారం శివారు ప్రాంతాల్లో ఉంది. ఇందులో తన కూతురికి 5.34 ఎకరాల భూమిని ఇచ్చాడు. ఆ భూమిని పక్కన ఉన్న రైతులు ఆక్రమించుకున్నారని దానిని సర్వే చేయాలని గతేడాది మే నెలలో మీసేవలో దరఖాస్తు చేసుకున్నాడు. అప్పుడు సర్వే చేసి హద్దులు పెట్టకుండా వదిలేశాడు. అనంతరం మనోహర్‌రావు అమెరికా వెళ్లిపోయాడు. అనంతరం జనవరిలో వచ్చిన రైతు తన కుమార్తెకు ఇచ్చిన భూమిని సర్వే చేయాలని జనవరిలో మీసేవలో సర్వే కోసం చలాన్ చెల్లించి దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే చేయాలని తహసీల్దార్ కార్యాలయం, సర్వేయర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. అయినప్పటికీ ఎంతకు సర్వే చేయడం లేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన విధులు నిర్వర్తిస్తున్న సర్వేయర్ బొచ్చు మహేందర్ మనోహర్‌రావును కలిశాడు. దీంతో సర్వేయర్ భూమిని కొలిచేందుకు రైతు మనోహర్ వద్ద నుంచి రూ.10వేలు ఇవ్వాలని అడిగి అట్టి డబ్బులను సర్వే చేశాక ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని కోయగూడ-ఎల్లాపూర్ గ్రామ శివారులోని భూములను సర్వేయర్ మహేందర్ సోమవారం చేపట్టారు. మొదట చేసుకున్న ఒప్పందం ప్రకారం రైతు మనోహర్ నుంచి రూ.10 వేలు సర్వేయర్‌కు మండల కేంద్రంలోని తాళ్లగడ్డ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం సమీపంలో ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈ నెల 4న ఎర్రబెల్లి మనోహర్‌రావు ఏసీబీకి ఫిర్యాదు చేయగా కొన్ని రోజులుగా రెక్కీ నిర్వహించి రైతు నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సర్వేయర్‌ను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు మంగళవారం ఏసీబీ కోర్టులో రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఏసీబీ దాడులు తహసీల్దార్ కార్యాలయంలో అలజడి సృష్టించాయి. తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్ విభాగం బీరువా, అతని వద్ద ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యాలయంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. నెలన్నర రోజుల్లోనే రెండుసార్లు ఏసీబీ దాడులు జరగడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఏసీబీ దాడుల్లో సీఐ శ్యాం, శ్రీను, రవిలు పాల్గొన్నారు.

ఇబ్బందులకు గురిచేసినందునే..

భూమి కొలతలు వేసే క్రమంలో తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఆక్రమించిన రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. సర్వేయర్ రూ.10 వేలు డిమాండ్ చేయడంతో ఇస్తానని ఒప్పుకుని ఏసీబీని ఆశ్రయించాను.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి

ముత్తిరెడ్డిని ఆప్యాయంగా పలకరిస్తున్న మంత్రి



దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేసింది కేసీఆరే..

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ధర్మసాగర్ : దేవాదుల ప్రాజెక్టు పనులు పూర్తిచేసి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు, జనగాం జిల్లాకు సాగునీరందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం వేలేరు మండలంలోని సోడషపల్లిలో ఏర్పాటు బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 20 ఏళ్ల కింద టీడీపీ దేవాదుల పనులు మొదలు పెట్టింది కానీ తర్వాత వచ్చిన కాంగ్రెస్ 10 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎక్కడి పనులు అక్కడే అన్న చందగా ఉందని తెలిపారు. అనంతరం టీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ రూ.8 వేల కోట్లు మంజూరు చేసి దేవాదుల పనులు ప్రారంభించి 100 టీఎంసీల నీరు ఇచ్చారన్నారు. ఒకప్పుడు ఘన్‌పూర్, పాలకుర్తి, జనగాం నియోజకవర్గాలు ఎడారులుగా ఉండేవన్నారు. కానీ ఇప్పుడు ఆ ప్రాంతాల న్నీ పచ్చగా కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్యలు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు.

రాజకీయ జన్మనిచ్చిన నియోజకవర్గం



తనకు రాజకీయ జన్మనిచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజల కోసం రాజకీయంలో ఉన్నంత కాలం రుణపడి ఉంటానని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజక వర్గంలో కొన్ని పనులు మిగిలి ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం కేంద్రంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి, రఘునాథపల్లి, లింగాలఘణపురం, వేలేరు మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు.

కేసీఆర్ పాలనతో బడుగు, బలహీనవర్గాలకు స్వర్ణయుగం



ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన బడుగు బలహీన వర్గాలకు ఒక స్వర్ణయుగం. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. పేదవాడి కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం అయితే ఎలా ఉంటుందన డానికి ఈ రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుకు నిదర్శనం. గతంలో మహిళలంటే చిన్న చూపు ఉండేది. కేసీఆర్ పాలనలో మహిళల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టింది. ఇవ్వాలా గతంలో ఎలా ఉండే, ఇప్పుడు ఎలాఉంది?. బీఆర్ఎస్‌లోనే ప్రజలకు మేలు జరుగుతుంది.

మనసున్న మనిషి కేసీఆర్



జనగామ: జిల్లాలోని వ్యవసాయ భూములను గోదావరి జలాలతో పునీతం చేసిన సీఎం కేసీఆర్.. ఎత్తైన ప్రాంతంలోని రైతులకు సాగునీరందించడానికి మూడు మినీ లిఫ్టు ట్యాంకుల నిర్మాణం చేపట్టిన మనసున్న మనిషి అని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా వేలేరులో జరిగిన మంత్రి కేటీఆర్ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత వరి దిగుబడిలో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. మినీ లిఫ్టు ట్యాంకుల నిర్మాణంతో జనగామ నియోజకవర్గానికే అత్యధికంగా ఫలితం కలుగుతుందని చెప్పారు.

కేటీఆర్ ఆప్యాయ పలకరింపు

వేలేరు సభ ముగిసిన తర్వాత మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డిని యాదన్నా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ మాట్లాడారు. యాదన్నా.. రైతన్న కళ్లలో ఆనందం చూసేందుకు పట్టుబట్టి లిఫ్టు ట్యాంకులను సాధించుకున్నావ్.. ఇంకా బాగా పనిచేయాలి.. శభాష్ అంటూ భుజం తట్టారు.

వేలేరును అన్ని విధాలా అభివృద్ధి చేశా...



వేలేరును అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. వేలేరు ప్రాంతం నాడు తొలి దశ తెలంగాణ ఉద్యమంలో, నక్సలిజంలో, మలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రాంతమన్నారు.. వేలేరును అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్‌కు విన్నవించిన వెంటనే అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. త్వరలో మిగతా పనులు పూర్తి చేసుకుంటామన్నారు. దీంతో వేలేరు మండలంలో 100 శాతం పనులు పూర్తి అవుతాయని తెలిపారు.

అభివృద్ధే లక్ష్యంగా కృషి..



నియోజకవర్గ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ఎమ్మెల్యే పదవిని కూడా గడ్డిపోసలా తీసేసి పదవికి రాజీనామా చేసి ఉద్యమంలో పాల్గొన్నానని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు అడిగిన వెంటనే అనేక అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. తనను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.



హనుమకొండ కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తో..



బోనాలతో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు



వృద్ధురాలితో ముచ్చటిస్తున్న కేటీఆర్